క్లుప్తంగా

సాగరతీరంలో పర్యాటకుల సందడి

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పర్యాటకుల సందడితో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరంలో గస్తీ నిర్వహించి, ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

రాయితీ బియ్యం ప్రత్యేక కేంద్రం ప్రారంభం

నాగాయలంక: ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల కేంద్రం నాగాయలంకలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు రాయితీ ధరల కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ ఆదివారం తెలిపారు. ప్రధాన కూడలిలోని బాలాజీ జనరల్ స్టోర్స్‌లో స్పెషల్ కౌంటర్ ప్రారంభించామన్నారు. రా రైస్(బీపీటీ–సోనామసూరి)కేజీ రూ.48, స్టీమ్‌రైస్(బీపీటీ–సోనామసూరి)కేజీ రూ.49, దేశవాళీ కందిపప్పు కేజీ ధర రూ.160కు విక్రయిస్తామన్నారు.

8.84 క్వింటాళ్ల బియ్యం..1.64 క్వింటాళ్ల కందిపప్పు విక్రయం

పెడన: ధరల స్థిరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెడన రైతుబజార్‌లో ఇప్పటి వరకు 8.84 క్వింటాళ్ల బియ్యం, 1.64 క్వింటాళ్ల కందిపప్పు విక్రయించినట్లు పెడన తహసీల్దార్ ఆర్. రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కౌంటర్ ద్వారా రైతుబజారులో నాణ్యమైన కందిపప్పు, బియ్యం విక్రయాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి



మచిలీపట్నం టౌన్: ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఎంతోమంది పేద రోగుల ప్రాణాలు కాపాడాలని జిల్లా సర్వజన ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్, నేత్ర వైద్య నిపుణుడు జి. భానుమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక ఈడేపల్లిలోని బెల్ ఎంప్లాయీస్ ఆడిటోరియంలో మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన భానుమూర్తి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురు కావన్నారు. మాజీ కౌన్సిలర్ కొట్టే వెంకట్రావు, వైద్యురాలు పావని, మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు వేణు కుమార్, గౌరవాధ్యక్షుడు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణకాశీకి ఉచిత బస్సు సదుపాయం

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం నుంచి దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయానికి ఉచిత బస్సును ఏర్పాటు చేసినట్లు పెదకళ్లేపల్లి గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి తెలిపారు. అందులో భాగంగా మోపిదేవికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం మరో పుణ్యక్షేత్రానికి గత 13 వారాలుగా ప్రతి ఆదివారం ఉచిత బస్సు మోపిదేవి నుంచి నడుపుతున్నట్లు చెప్పారు. అవనిగడ్డ ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల యాజమాన్యం ఉచిత బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి

దాలిపర్రు(ఘంటసాల): గ్రామస్తులందరూ తాగునీటికి ఉపయోగించే బావిలో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని దాలిపర్రు గ్రామస్తులు కోరుతున్నారు. ఘంటసాల మండలం దాలిపర్రు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉండే ఏకైక మంచినీటి బావిని గ్రామస్తులందరూ వినియోగిస్తారు. అయితే కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బావి సమీపంలో నీరు నిల్వ ఉండటంతో ఆ నీటి ఊట బావిలోని తాగునీటితో కలుషితం కావడంతో నీరు రంగు మారడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు తక్షణమే స్పందించి బావి సమీపంలోని నీరు బయటకు పోయే మార్గం చూడాలని కోరారు.


శతాక్షీదేవి.. శిరసానమామి



శాకంబరీదేవిగా అడ్డంకి నాంచారమ్మ



పెదతుమ్మిడి శివాలయంలో..



కృత్తివెన్ను మండలం నీలిపూడిలో..



కలశాల పూజ నిర్వహిస్తున్న భక్తులు



గణపేశ్వరం దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించిన మహిళలు

కోడూరు: కోడూరు, చుట్టూ పక్కల గ్రామాల్లోని ఆలయాలు భక్తుల రాకతో సందడిగా మారాయి. వంతెన సెంటర్‌లోని గంగాభవానీ అమ్మవారికి ఆర్యవైశ్య ప్రముఖులు ఆషాఢ సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. 21 రకాల పుష్పాలు, గాజులు, చీరలతో పాటు వివిధ పండ్లను అమ్మవారికి సమర్పించారు.

- కోడూరు సంతమార్కెట్ సమీపంలోని కనకదుర్గమ్మ అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. ముందుగా గురు పౌర్ణమిని పురస్కరించుకొని పండితులను సత్కరించారు.
- విశ్వనాథపల్లి అడ్డంకి నాంచారమ్మ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరీదేవిగా దుర్గమ్మ

కృత్తివెన్ను: ఆషాఢ మాసంలో కనకదుర్గమ్మ వారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల పరిధిలోని నీలిపూడి గ్రామంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మను వివిధ రకాల కూరగాయలతో భక్తులు సుందరంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పుప్పాల ఆంజనేయులు (బుజ్జి), అర్చకుడు యుగంధర్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో 121 కలశాలతో అభిషేకం

మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ శివాలయంలో వేంచేసి ఉన్న మహిషాసురమర్దిని అమ్మవారికి ఆషాఢ పౌర్ణమి సందర్భంగా 121 కలశాలతో అభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి ఈ అభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారికి లక్ష మల్లెలతో పౌర్ణమి పూజ నిర్వహించారు.

ఘనంగా చండీ మహా యాగం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీ అన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మశ్రీ క్రోవి సత్యనారాయణశర్మ బ్రహ్మత్వంలో చండీ మహాయాగం నిర్వహించారు. యాగం పూజల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు పీటలపై కూర్చున్నారు. అమ్మవారిని 50కిలోల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో శాకంబరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు.

శాకంబరీదేవికి ప్రత్యేక పూజలు

బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి, బంటుమిల్లి గ్రామాల్లోని పలు ఆలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్లు ఆదివారం శాకంబరీదేవి అలంకరణలో భక్తుల పూజలు అందుకున్నారు.

108కిలోల పసుపు, కుంకుమలతో ఆషాఢ సారె

గణపేశ్వరం(నాగాయలంక): మండలంలోని గణపేశ్వరం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం తలశిల స్వర్ణలత, లేబాక పద్మప్రియ ఆధ్వర్యంలో 108 కిలోల పసుపు కుంకుమలతో కూడిన ఆషాఢ సారెను సమర్పించారు. అలాగే నాగాయలంక, గణపేశ్వరం, తలగడదీవి తదితర పలు గ్రామాల నుంచి మహిళలు సారెను ఊరేగింపుతో ఆలయానికి తీసుకొచ్చి సమర్పించారు.

అంతా అల్లా కుటుంబమే



మాట్లాడుతున్న సయ్యద్ కరీమ్

ఘంటసాల: సర్వ మానవాళి అల్లాహ్ కుటుంబమేనని అహ్మదీయ ముస్లిం జమాత్ ఏపీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ కరీమ్ అన్నారు. ఘంటసాల చిన్న మసీదులో అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం జమాత్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రవక్త హజ్రత్ మహ్మద్ ముస్తఫా జీవిత చరిత్ర సమావేశం సంస్థ స్థానిక అధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ కరీమ్ మాట్లాడుతూ మానవుడు సంఘ జీవని, సమాజంలో ఎదురయ్యే అనేక రుగ్మతలను రూపుమాపేందుకు ప్రవక్త మహ్మద్ తన జీవితాంతం కృషి చేశారని తెలిపారు. సంస్థ కృష్ణాజిల్లా ఇన్‌చార్జి మహ్మద్ ఉస్మాన్ మాట్లాడుతూ సర్వ మానవాళి అల్లాహ్ కుటుంబంగా భావిస్తూ మానవాళికి సేవ చేశారన్నారు. స్థానిక మౌలానా మహ్మద్ ఇస్మాయిల్, జిల్లా అధ్యక్షుడు షేఖ్ ఖాసీం సాహెబ్, షేక్ అమీరుద్దీన్ తదితరులు

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కోడూరు: మండలంలోని సచివాలయాల్లో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు ఆదివారం కోరారు. కోడూరు, ఉల్లిపాలెం సచివాలయ పరిధిలోని ప్రజలకు కోడూరు–2 సచివాలయం వద్ద, మందపాకల, పోటుమీద ప్రజలకు మందపాకల సచివాలయంలో, లింగారెడ్డిపాలెం ప్రజలకు అదే గ్రామ పంచాయతీ వద్ద, విశ్వనాథపల్లి, వి.కొత్తపాలెం, పిట్టల్లంక, సాలెంపాలెం సచివాలయాల ప్రజలకు విశ్వనాథపల్లి సచివాలయంలో ఈ కేంద్రాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి కేంద్రం వద్ద ఒక మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్ విధులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు



జిల్లా కోర్టు సెంటర్‌లో బాబావారికి వస్త్రాలు సమర్పిస్తున్న మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ



పెడనలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



కోడూరులో సాయినాథునికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

కోడూరు: స్థానిక షిర్డీసాయి దివ్యధాన్య జ్ఞాన మందిరంలో సాయినాథుని పాలరాతి విగ్రహానికి భక్తులే స్వయంగా క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. లింగారెడ్డిపాలెంలోని సాయిబాబా ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన ధుని ఆదివారం ప్రారంభించారు. కోడూరు, లింగారెడ్డిపాలెంలోని సాయిబాబా ఆలయాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

- మోపిదేవి: గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. కప్తాన్‌పాలెంలో వేంచేసియున్న శ్రీ షిర్డీ సాయిబాబా విగ్రహం వద్ద ఆలయ కమిటీ అన్నసమారాధన నిర్వహించింది.
- నాగాయలంక: స్థానిక షిర్డీ సాయిబాబా దివ్య జ్ఞాన మందిరంలో సాయి భక్తులు కిటకిటలాడారు. భావదేవరపల్లిలోని షిర్డీసాయిబాబా సత్సంగ మందిరంలో, తలగడదీవి, నంగేగడ్డ, భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామాలలోని అమ్ముల షిర్డీ సాయి సేవాశ్రమం ఆధ్వర్యంలోని సాయిబాబా మందిరాలలో గురుపౌర్ణమి వేడుకలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిపారు.
- ఘంటసాల: పంచశీల సూత్రాలు పాటిస్తూ బుద్ధుని బోధనలు అనుసరిస్తే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని భంతే ధమ్మ ధజ థెరో అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలలోని అమరావతి బుద్ధ విహార్‌లో గురు పూర్ణిమ కార్యక్రమం భంతే ధమ్మ ధజ థెరో ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ధ్యానం నేర్పించి ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు అందించారు.
- బంటుమిల్లి: బంటుమిల్లి, పెందుర్రు, జానకీరామపురం, అర్తమూరు సాయినగర్ గ్రామాల్లోని శ్రీ షిర్డీసాయి మందిరాల్లో తెల్లవారుజామున నగర సంకీర్తన చేశారు. అర్తమూరు సాయినగర్‌లోని సాయి మందిరంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.
- పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వేకువ జామున ఐదు గంటలకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులు సత్యసాయిబాబా చిత్రపటంతో మేళతాళాలతో పెడన బస్టాండ్ నుంచి శివాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు.
- అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ, గాంధీక్షేత్రంలో షిర్డీసాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గాంధీ క్షేత్రం షిర్డీ దివ్యసాయి మందిరంలో 30 లీటర్ల ఆవు పాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.
- మచిలీపట్నం టౌన్: నగరంలోని సాయిబాబా ఆలయాలతో పాటు ఇతర ఆలయాల్లోనూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా కోర్టు సెంటర్లోని సాయిబాబా మందిరంలో స్వామివారికి నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ నూతన వస్త్రాలను సమర్పించి పూజలు చేశారు. బలరామునిపేటలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయం ఆవరణలో ఉన్న శ్రీ షిర్డీ సాయి బాబా పూజలు చేశారు.
- కృత్తివెన్ను: మండల పరిధిలోని పలు గ్రామాలలో గల సాయిబాబావారి మందిరాలందు, పలు చోట్ల వ్యాసమహర్షి చిత్రపటాలను పూజించి గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ట్రిపుల్ ఐటీ సీటు పొందిన విద్యార్థినికి ఆర్థిక సాయం



పెడన: పట్టణంలోని పదో వార్డు రాజీవ్‌నగర్‌కు చెందిన కుర్మా ఆంజనేయులు, శ్యామల కుమార్తె సాత్విక కడపలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. దీంతో ఆమె సహాయ ఫౌండేషన్ ద్వారా రూ.8వేలు ఆర్థిక సాయం అందించినట్లు మునిసిపల్ వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి అన్నారు. ఆదివారం ఉదయం సాత్విక ఇంటి వద్ద సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు సాత్విక కుటుంబ సభ్యులను కలిసి ఈ నగదు అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్‌బాషా మాట్లాడుతూ పేద విద్యార్థిని ఉన్నత చదువులకు ఎన్‌ఆర్‌ఐలైనటువంటి కుప్ప వరప్రసాద్, గాయత్రి దంపతుల సహకారంతో ఆర్థిక సాయాన్ని విద్యార్థినికి అందించామన్నారు. అనంతరం సాత్వికను, ఆమె తల్లిదండ్రులను సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ కోత విధించనున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జి ఏఈ నాగరాజు ఆదివారం తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనులు నిమిత్తం విద్యుత్ సరఫరాను ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిలుపుదల చేయనున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రజలందరూ సహకరించాలని ఏఈ కోరారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

కోడూరు: గురుపౌర్ణమిని పురస్కరించుకొని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉపాధ్యాయులు బచ్చు ప్రభాకరరావు, సనకా శంకరరావు, కొడాలి అమర్‌చంద్, మండలి వెంకటేశ్వరరావులను పార్టీ నేతలు దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఎడతెరిపిలేని వర్షంతో ఇక్కట్లు

మచిలీపట్నంటౌన్: నగరంలో ఆదివారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా గత వారం రోజులుగా కురుస్తున్న వర్షం శనివారం రాత్రి తెరిపి ఇచ్చింది. ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్షం కురవలేదు. ఆ తర్వాత ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తూనే ఉండటంతో నగర ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు

పెడన: పట్టణంలోని 6వ వార్డులో తులసి థియేటర్ సమీపంలో మంచినీటి బావి పక్కన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పెడన ఎస్ఐ టి. సూర్యశ్రీనివాస్ మాట్లాడుతూ 2018లో 6వ వార్డుకు చెందిన అంబేడ్కర్ కమిటీ సభ్యులు అంబేడ్కర్ విగ్రహం అనధికారికంగా నిర్మించారన్నారు. ఈ నిర్మాణాన్ని అబ్దుల్ సలాం, అతని బంధువులు వ్యతిరేకించి కేసు పెట్టారన్నారు. ఇది ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉందని వివరించారు. అయితే శనివారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం చుట్టూ పిల్లర్లు వేస్తూ ప్లాట్‌ఫాం దిమ్మను నిర్మించారన్నారు. ఈ ప్లాట్‌ఫాం దిమ్మను అబ్దుల్ సలాం, అతని బంధువులు తొలగించడానికి ప్రయత్నం చేయగా.. స్థానికులు అడ్డుకునే సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుందన్నారు. సంఘటన ప్రాంతాన్ని మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభాన్, పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్ సందర్శించి, ఇరుపక్షాల వారితో మాట్లాడారన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం



పెడన: పేదల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేకంగా టీబీ పరీక్షలు చేయించడానికి ఒక యూనిట్ నిర్మించాలని పేర్కొనడంతో రూ.50లక్షలతో పనులు ప్రారంభించామన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ 15వ ఆర్థిక ఆరోగ్య నిధులతో ఈ యూనిట్ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్‌ఖయ్యుం, జెడ్పీటీసీ ఆర్జా వెంకటనగేష్, మున్సిపల్ టీపీవో ఏసుబాబు పాల్గొన్నారు.

పండుగలు జీవన విధానంలో భాగం

కృత్తివెన్ను: పండుగలు మనిషి జీవన విధానంతో ముడిపడి ఒక భాగంగా ఉంటాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని నీలిపూడి కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొమాళ్లపూడి సాయిబాబా మందిరంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొని బాబా వారిని దర్శించుకున్నారు.